# సాక్షి
## శ్రీకాకుళం

సోమవారం ◆ 24 ◆ ఏప్రిల్ ◆ 2023






### స్వయం ఉపాధి ప్రాప్తిరస్తు

మహిళా సంఘాలకు అండగా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. లక్ష్యానికి మించి రుణాలిస్తున్నారు. - 8లో



### అలంకరణలు అదరహో

స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. - 8లో

**శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు**

| మండలం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆమదాలవలస | 35° | 23° |
| ఇచ్ఛాపురం | 35° | 23° |
| పాతపట్నం | 35° | 23° |
| శ్రీకాకుళం | 36° | 24° |

## న్యూస్‌రీల్

### శ్రీకూర్మనాథుని కల్యాణానికి పందిరి రాట



పందిరి రాట వేస్తున్న దృశ్యం

**గార:** శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవానికి ఆదివారం పందిరాట వేశారు. వైశాఖ ఏకాదశి పర్వదినం స్వామి కల్యాణోత్సవం జరగనుంది. తొమ్మిది రోజుల పాటు నవవాహ్నిక దీక్షతో కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం విశ్వక్సేన పూజ వంటి వైదిక క్రియలు అనంతరం పందిరి రాట వేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, కిషోర్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

### బంగారం దుకాణాలు కళకళ



ఇచ్ఛాపురంలోని బంగారు దుకాణంలో ఆభరణాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

**ఇచ్ఛాపురం:** అక్షయ తృతీయను పురస్కరించుకొని పట్టణంలోని బంగారు దుకాణాలన్నీ కళకళలాడాయి. అక్షయ తృతీయ సందర్భంగా బంగారు ఆభరణాలు కొని ఇంటికి తీసుకొస్తే లక్ష్మీదేవి కటాక్షం కలుగుతుందనే నమ్మకంతో మహిళలు ఆదివారం బంగారు ఆభరణాలు కొనేందుకు ఎగబడ్డారు.

### సజావుగా అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష



దుప్పలవలస అంబేడ్కర్ గురుకులంలో పరీక్ష పరిశీలిస్తున్న అధికారులు

**ఎచ్చెర్ల క్యాంపస్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు/జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం సజావుగా ముగిసింది. జిల్లాలోని ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఐదో తరగతి ప్రవేశాలకు జిల్లా నుంచి 2,238 మంది దరఖాస్తు చేసుకోగా, 1751 మంది (78.22 శాతం) హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి 1604 మంది దరఖాస్తు చేసుకోగా, 1236 మంది (77.05శాతం) హాజరయ్యారు. గురుకుల విద్యాలయ సంస్థల అకడమిక్ మానిటరింగ్ అధికారి నోములు సంజీవరావు, జిల్లా సమన్వయకర్త జి.గ్రేస్, దుప్పలవలస గురుకుల ప్రిన్సిపాల్ దువ్వాడ దేవేంద్రరావు పరీక్షలు పర్యవేక్షించారు. పరీక్షల ఫలితాలు 15 రోజుల్లో విడుదల చేసి, అనంతరం కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని అధికారులు వివరించారు. పరీక్ష రాసిన విద్యార్థులు గురుకుల విద్య సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

### సొండి కులస్తుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కాశీవిశ్వనాథం

**మందస:** సొండి కులస్తుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సొండికుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. మందస మండలంలోని హరిపురంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందని, సొండి కులానికి కూడా న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఓబీసీ, ప్రత్యేక కార్పొరేషన్‌పై చర్చించారు. మందస మండల స్థాయిలో సంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రత్నాల కాశీ విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి బి.రాజారావు, కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, సంఘం నాయకులు షావుకారి నాగేశ్వరరావు, పాండవ చంద్రశేఖర్, నల్లహడ్డి బాలకృష్ణ, బాబురావు, శ్రీధర్, వెంకటేష్, షాహుకారి మోహనరావు, రత్నాల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆ గుండె చప్పుడు పదిలం



కిరణ్‌చంద్ (ఫైల్)

ఆ గుండె చప్పుడు ఆగిపోలేదు. మరో మనిషి రూపంలో అమ్మను తలచుకుంటూనే ఉంటుంది. ఆ కంటి చూపు ఆరిపోలేదు. ఇంకొకరి బతుకులో వెలుగులు నింపి నాన్న పరిచయం చేసిన ఈ లోకాన్ని చూస్తూనే ఉంటుంది. ఆ తల్లిదండ్రులకు బిడ్డ భౌతిక కాయమే దూరమైంది. కానీ వారు ఊపిరి పోసిన ప్రాణం మరో ఐదుగురి రూపాల్లో సజీవంగానే ఉంది. కన్నబిడ్డ శాశ్వతంగా దూరమైపోతున్నాడన్న బాధను దిగమింగుకుని అతని అవయవాలు దానం చేయాలన్న అమ్మానాన్నల ఆలోచన.. ఐదుగురికి ఆయువు పోసింది.



ఆఖరి చూపు

- అవయవదానంతో చిరంజీవిగా మారిన ఎం.కిరణ్‌చంద్
- తాను చనిపోతూ మరో ఐదుగురికి పునర్జన్మ
- టెన్త్ పరీక్షల సమయంలో మెదడులో చిట్లిపోయిన నరాలు
- బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారణ
- బిడ్డ అవయవాలు దానం చేసేందుకు ముందుకువచ్చిన తల్లిదండ్రులు
- రాగోలు జెమ్స్ ఆధ్వర్యంలో గ్రీన్ చానెల్ ద్వారా ఆర్గాన్స్ తరలింపు

**శ్రీకాకుళం రూరల్:** మల్లారెడ్డి కిరణ్ చంద్.. ఈ పేరు శ్రీకాకుళం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. జిల్లాలో అవయవదానం చేసిన తొట్టతొలి వ్యక్తిగా ఈ యువకుడి పేరు నిలిచిపోయేలా అతడి తల్లిదండ్రులు అపురూప నిర్ణయం తీసుకున్నారు. వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించిన తర్వాత యువకుడి అవయవాలు దానం చేయడానికి తల్లిదండ్రులు ముందుకు వచ్చారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం అవయవాలను సేకరించి గ్రీన్ చానెల్ ద్వారా వేర్వేరు ఆస్పత్రులకు పంపించారు. అదే రోజు ఈ అవయవాలను ఆపదలో ఉన్న వారికి అమర్చనున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

సోంపేటలోని గీతామందిర్ కాలనీకు చెందిన మల్లారెడ్డి మోహన్‌రావు, గిరిజా కళ్యాణిల ఒక్కగానొక్క కుమారుడు కిరణ్‌చంద్ (16) సోంపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టెన్త్ చదువుతున్నాడు. ఈ నెల 15వ తేదీన చివరి పరీక్షకు చదువుతుండగా తీవ్రమైన తలనొప్పి, జ్వరం వచ్చింది. దీంతో అతడిని స్థానిక వైద్యుల వద్దకు తల్లిదండ్రులు తీసుకెళ్లారు. అయితే మెదడులో సమస్య వచ్చిందని గమనించిన వైద్యులు వెంటనే విశాఖ వెళ్లాలని సూచించారు. అక్కడకు వెళ్లి పరీక్షలు చేస్తే.. మెదడులో నరాలు చిట్లిపోయాయని, బతికే అవకాశాలు చాలా తక్కువని తేల్చేశారు. దీంతో అక్కడి నుంచి శ్రీకాకుళం సమీపంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి కిరణ్‌చంద్‌ను తీసుకువచ్చారు. అయితే వారం రోజులుగా వైద్యం అందిస్తున్నా యువకుడి పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. బిడ్డ పరిస్థితిని చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయేవారు.

ఈ పరిస్థితుల్లో ఆర్గాన్ డొనేషన్ సమన్వయకర్తలు, బంధువులు కిరణ్‌చంద్ తల్లిదండ్రులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. బిడ్డ అవయవాలను కాల్చి బూడిద చేసే బదులు దానం చేస్తే మరొకరి రూపంలో కిరణ్ సజీవంగానే ఉంటాడని వివరించారు. దీంతో కిరణ్ గుండె, కిడ్నీలు, లివర్, కళ్లను దానం చేయడానికి అతడి అమ్మానాన్న ఒప్పుకున్నారు. దీంతో జెమ్స్ వైద్యులు అవయవాల తరలింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియ జరగడం జిల్లా చరిత్రలో ఇదే ప్రథమం.

**రెడ్ కార్పెట్ పరిచి..**

కిరణ్ చంద్ మృతదేహానికి జెమ్స్ ఆసుపత్రి సిబ్బంది ఘన నివాళులర్పించింది. మృతదేహాన్ని తరలించేందుకు రెడ్‌కార్పెట్ పరిచి మార్చురీ వరకూ జెమ్స్ విద్యార్థులు పూలు చల్లుతూ సాగనంపారు. కొవ్వొత్తులు వెలిగించి జయహో కిరణ్‌చంద్ అంటూ నినాదాలు చేశారు.



కిరణ్ పార్థివ దేహానికి జెమ్స్ సిబ్బంది సెల్యూట్

### గ్రీన్ చానెల్ ద్వారా..

- కిరణ్‌చంద్ అవయవాలు గ్రీన్ చానెల్ ద్వారా తరలించేందుకు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు యుద్ధ ప్రాతిపదికన పూనుకున్నారు.
- జెమ్స్ సీఈఓ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఒక పైలెట్, ఎస్కార్ట్‌ల సహాయంతో ఆంబులెన్స్‌లో అవయవాలు తరలింపునకు అంతా సిద్ధం చేశారు.
- గుండెకు ఆపరేషన్ చేసి 2గంటల 59 నిమిషాలకు ఆంబులెన్స్‌లో ఎక్కించగా విశాఖపట్నం లోని చార్టర్ ఫ్లైట్‌కు 4 గంటల 20 నిమిషాలకు చేరుకుంది.



గుండె తరలిస్తున్న దృశ్యం

- ఫ్లైట్ గుండా తిరుపతిలోని పద్మావతి ఆస్పత్రికి గుండెను చేర్చనున్నట్లు వైద్యులు తెలిపారు.
- ఈ గుండెను కేవలం 4 నుంచి 5 గంటల్లోపు వేరొకరికి మార్పిడి చేస్తే సక్సెస్ అవుతుందని కిమ్స్ వైద్యులు గూడేన సోమేశ్వరరావు తెలిపారు.



కిడ్నీలు, లివర్ తరలిస్తున్న దృశ్యం

- అలాగే 3.48కు కిడ్నీలు, లివర్, ఆపరేషన్ చేసి విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు.
- వీటిని కూడా కేవలం 7 నుంచి 8 గంటల్లోగా వేరే వాళ్లకు మార్చుతున్నట్లు ఆర్ఎంఓలు డాక్టర్ ప్రవీణ్, బాలమురళీ వెల్లడించారు.
- కళ్లను మాత్రం శ్రీకాకుళంలోని రెడ్‌క్రాస్‌కు అందించినట్లు తెలిపారు.

### గర్వంగా ఉంది..

మా అబ్బాయి కిరణ్‌చంద్ అవయవాలు ఐదుగురి ప్రాణాలు నిలబెడుతున్నాయంటే మాకు ఎంతో గర్వంగా ఉంది. మాలాగే అందరూ అవయవదానానికి ముందుకు రావాలి. మా అబ్బాయి నుంచి తీసుకున్న గుండె, లివర్, కిడ్నీలు, కళ్లు ఇంకొకరికి ఉపయోగ పడుతున్నాయంటే మాకు సంతృప్తిగా ఉంది.

– మోహన్ రావు, గిరిజా కల్యాణి,
కిరణ్ చంద్ తల్లిదండ్రులు



### బంగారం చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

**శ్రీకాకుళం క్రైమ్ :** బంగారం చోరీ కేసులో ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు, మరో నిందితుని కోసం గాలిస్తున్నట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. స్థానిక పీఎన్‌కాలనీలో నసపల సారథి, అతని భార్య నివాసముంటున్నారు. ఈయన మహారాష్ట్రలోని ఎస్‌ఎంబీఎస్‌లో ఉద్యోగం చేసి రిటైరయ్యాక.. ఏడాది కిందట శ్రీకాకుళం వచ్చి స్థిరపడ్డారు. వైద్యం కోసం భార్యాభర్తలు ఈ నెల 17న విశాఖపట్నం వెళ్లారు. మరునటి రోజు (18న) రాత్రి దొంగతనం జరిగింది. 19వ తేదీ ఉదయం సారథి పక్కింటివాళ్లు డోర్‌లు తెరిచి ఉండడం చూసి వెంటనే ఫోన్ చేయడంతో వారు ఇంటికి వచ్చేశారు. బీరువా తెరిచి ఉండడంతో చూడగా.. ఆరుతులాల బంగారం చోరీకి గురైందని తెలుసుకున్నారు. వెంటనే 100కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు, క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించడంతో పాటు దగ్గరలో ఉన్న సీసీ పుటేజీని పరిశీలించారు. నలుగురు వ్యక్తులు చోరీకి వచ్చినట్లు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా పెందుర్తికి చెందిన నంబారు రాంబాబు (23), కెరటాల ఈశ్వరరావు (20), బడితమాను వెంకటసాయి(30)ని నిందితులుగా గుర్తించారు. ఆదివారం కిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఈ ముగ్గురూ తచ్చాడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి బంగారాన్ని రికవరీ చేసుకున్నామని మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామని, దొరికినవారిలో బడితమాను వెంకటసాయిపై విశాఖలో సుమారు 20 దొంగతనాల కేసులున్నట్లు సీఐ చెప్పారు. నగరంలో ప్రజలు ప్రయాణాలకు వెళ్లినప్పుడు విలువైన వస్తువులు, డాక్యుమెంట్లు తమ వెంట పట్టుకెళ్లాలని, లేదంటే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని, పోలీసులకు ముందస్తు క్యాంపు సమాచారం తప్పక ఇవ్వాలని సీఐ సూచించారు.

### 'పాలిసెట్ ఉచిత శిక్షణ వినియోగించుకోండి'

**ఎచ్చెర్ల క్యాంపస్:** జిల్లాలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇస్తున్న పాలీసెట్–2023 ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పాలిసెట్ సమన్వయ కర్త, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకి రామయ్య అన్నారు. కళాశాలలో ఆయన ఆదివారం మాట్లాడుతూ సెట్ సిలబస్ గణితం, రసాయనశాస్త్రం, భౌతిక శాస్త్రాలపై పూర్తి అవగాహన కల్పించి, మోడల్ ప్రశ్న పత్రాలు సాధన చేయిస్తున్నట్లు వివరించారు. జిల్లా ప్రాంతీయ పరిధిలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీకాకుళం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, టెక్కలి, ఆమదాలవలస, సీతంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

## ఆదిత్యుని సన్నిధిలో వైశాఖ సందడి



సంప్రదాయ నివేదనలు చేస్తున్న మహిళలు

**అరసవల్లి:** ఆరోగ్య క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వైశాఖ మాస తొలి ఆదివారం సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో అరసవల్లి క్షేత్రంలో ప్రత్యేక సందడి కనిపించింది. వైశాఖ మాసం సందర్భంగా అంతరాలయంలో ఆదిత్యుని మూల విరాట్టుకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో విశేష అలంకరణ చేసి, సర్వదర్శనాలకు అవకాశమిచ్చారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు క్షేత్రానికి చేరుకుని తలనీలాలను సమర్పించుకుని స్నానాలు చేసి స్వామికి ప్రత్యేక ప్రసాదాలను నివేదించారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ఎస్.కోటేశ్వర చౌదరి, ద్వారపు అనూరాధ తదితరులు కూడా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు.

**పుష్కరిణి వద్ద పంట ఫలాలతో పూజలు**

వైశాఖ మాసం సందర్భంగా గ్రామీణ మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామికి సంప్రదాయ పూజలను నిర్వహించారు. తొలి పంట ఫలాలు, మామిడి పండ్లు, కొత్త ధాన్యం, పెసర మొలకలు, బెల్లం, గోధుమలతో ప్రత్యేక నైవేద్యంగా సమర్పించారు. ఏటా వైశాఖ, మాఘ మాసాల్లో రైతు కుటుంబాల భక్తులు ఇలా నివేదనలు చేయడం, మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,19,500, విరాళాలు, ఆర్జిత పూజల ద్వారా రూ. 56,537, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.80 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తెలియజేశారు.

### ● నెలవంక.. ఇలవంక



శివుడి సిగలో నెలవంక ఇలా మెరిసి మురిసింది. శ్రీకాకుళంలోని నాగావళి ఒడ్డున ఉన్న పార్కులో శివుని విగ్రహం మీదుగా ఆదివారం ఇలా తళుక్కుమంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

# మడ్డువలసకు మహర్దశ

- రెండో దశ పనుల ప్రారంభం నేడు
- పనులు చేపట్టేందుకు వీలుగా రూ.26.65 కోట్లు మంజూరు

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ), పొందూరు:** సిక్కోలు అన్నదాతలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎనలేని అభిమానం చూపిస్తున్నారు. ఇటీవలే మూలపేట పోర్టు, గొట్టా వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు మడ్డువలస ప్రాజెక్టు స్టేజ్–2 పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి పనులు ప్రారంభిస్తున్నారు. గొర్లె శ్రీరాములునాయుడు మడ్డువలస రిజర్వాయర్ ప్రాజెక్ట్ రెండో దశ పనులు సోమవారం ప్రారంభం కానున్నాయి. విజయనగరం జిల్లా(గతంలో శ్రీకాకుళం) వంగర మండలం మడ్డువలస గ్రామం సమీపంలో నాగావళి నదికి ఉపనది అయిన సువర్ణముఖి నది మీద ఈ ప్రాజెక్టు నిర్మించారు. వంగర, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి మండలాల్లో 90 గ్రామాలకు ప్రయోజనం చేకూర్చేందుకు 24,700 ఎకరాలు కుడి, ఎడమ ప్రధాన కాలువ కింద ఆయకట్టుకు సాగునీరు అందించడానికి దీన్ని నిర్మించారు. మొదటి దశ విస్తరణలో 27,500 ఎకరాలకు సాగునీరు అందించారు. రెండో దశ విస్తరణ ద్వారా అదనంగా 12,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం రూ.26.65 కోట్లు నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తూ పరిపాలనా పరమైన ఆమోదం తెలిపింది. 50.700 కిలోమీటర్ల వద్ద నుంచి కుడి ప్రధాన కాలువ మరో ఐదు కిలోమీటర్ల మేర విస్తరించడం ద్వారా, దీని పరిధి 55.700 కిలోమీటర్లు పెరగనుంది. ఈ పనుల ప్రారంభానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, స్పీకర్ తమ్మినేని సీతారాం హాజరు కానున్నారు.

**రెండో దశతో ఎంతో లాభం**

రెండో దశ విస్తరణ పనుల ద్వారా పొందూరు మండలంలో తండ్యాం, లక్ష్మీపురం, పొందూరు, రాపాక, వావిళ్లపల్లి పేట, వీఆర్ గూడెం, బుడ్డి కంచరాం, ధర్మపురం, కొంచాడ, తోలాపి, పిల్లలవలస, దళ్లవలస, కోటిపల్లి గ్రామాలకు ప్రయోజనం కలగనుంది. అలాగే లావేరు మండలంలో పైడయ్యవలస, కొత్త కుంకామ్, పాత కుంకామ్, అదపాక, పెద్దకొత్తపల్లి, బుడుమూరు, పెద్దరావు పల్లి, విజయరాంపురం గ్రామాల భూములు సస్యశ్యామలం కానున్నాయి. జి.సిగడాం మండలంలో కప్పరం, మధుపం, వాండ్రంగి గ్రామాలకు ఎచ్చెర్ల మండలంలో అరిణాం అక్కివలస గ్రామాలు భూములు పూర్తిస్థాయి సాగులోకి రానున్నాయి. . ధర్మపురం డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 12.25 కిలోమీటర్ల కాలువ ద్వారా 6,400 ఎకరాలు, అరిణాం అక్కివలస డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 10.70 కిలోమీటర్ల కాలువ ద్వారా 6,100 ఎకరాలు పూర్తిస్థాయిలో సాగులోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.



మడ్డువలస కుడిప్రధాన కాలువ తవ్వాల్సిన ప్రాంతం (వావిలిపల్లిపేట వద్ద)



మడ్డువలస ప్రాజెక్టు

### నీటి కష్టాలు తీరుతాయి



ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మడ్డువలస కాలువ పనులకు శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉంది. చాలా కాలంగా వర్షాలపై ఆధారపడి పంటలు వేస్తున్నాం. ఈ పనులు పూర్తయితే సమృద్ధిగా పంటలు పండించుకునేందుకు అవకాశం వస్తుంది. అంతేకాకుండా అపరాలు వేసుకుని నాలుగు డబ్బులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం.

– గంట అప్పారావు, రైతు, వాండ్రంగి,
జి.సిగడాం మండలం.

### పనులు శరవేగంగా పూర్తిచేస్తాం



మడ్డువలస రెండో దశ పనులు పూర్తిచేసి 12500 ఎకరాలకు సాగునీరందిస్తాం. కుడి కాలువ విస్తరణ పనులను శరవేగంగా పూర్తిచేసి 2024 ఖరీఫ్ నాటికి రైతులకు నీరందిస్తాం అలాగే రబీలో కూడా రెండో పంట వేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

– పొన్నాడ సుధాకర్,
ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ, శ్రీకాకుళం.

## క్లుప్తంగా

### ఇద్దరు జూదరుల అరెస్టు

టెక్కలి రూరల్: మండలంలోని భగవాన్‌పురం సమీపంలో పేకాట ఆడుతున్నరనే సమాచారం మేరకు ఆదివారం టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తన బృదంతో వెళ్లి పేకాట శిబిరంపై దాడిచేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.73,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### 'రమణీయం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ఉపనిషన్మందిర ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఉపనిషన్మందిరంలో డాక్టర్ ఎం.వి.రమణారావు రచించిన 'రమణీయం' పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రవచనకర్త డాక్టర్ నిష్ఠల నరసింహమూర్తి మాట్లాడుతూ షట్పది స్తోత్రం ప్రముఖ్యతను వివరించారు. అనంతరం ఉపనిషన్మందిరం పాత కార్యవర్గాన్నే కొనసాగిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆసక్తి ఉన్న కొత్తసభ్యులను అవసరమైతే చేర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పి.పతంజలిశాస్త్రి, మందుల మోహనరావు, సనపల నారాయణమూర్తి, ఎస్‌ఎస్‌ఎన్ స్వామి, చాగంటి బాపయ్య పంతులు, సీహెచ్ నిర్మల, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న పైడి శ్రీనివాసరావు

జి.సిగడాం: మండలంలోని మెట్టవలసలో ఈ నెల 21న వీధి కుక్కల దాడిలో పైల సాద్విక్షశ్రీ మృతి చెందడంతో చిన్నారి తల్లిదండ్రులు పైల రాంబాబు, రామలక్ష్మి దంపతులకు రణస్థలం మండల వ్యవసాయశాఖ సలహామండలి ఛైర్మన్ పైడి శ్రీనివాసరావు ఆదివారం రూ.10 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కామోజుల ఆరుద్ర సీతారాం, ఎంపీటీసీ సభ్యులు బెవర జగన్నాథం, బాలబొమ్మ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### అదనపు పరిహారం చెల్లించాలి



బైక్ ర్యాలీ చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, నిర్వాసితులు

కొత్తూరు : వంశధార ప్రాజెక్టు నిర్వాసితులకు అదనపు పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. మండలంలోని మెట్టూరు బిట్-1, 2, 3 ఆర్‌ఆర్ కాలనీల్లో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని కోరారు. అదనపు పరిహారాలు కొంత మందికి చెల్లించి మిగిలిన వారికి చెల్లించకపోవడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్, మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీ సర్పంచ్ కె.శ్రీనివాసరావు, తవుడు, షణ్ముఖరావు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 60,790-00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 55,720-00 |
| వెండి (కిలో) | 80,400-00 |

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు) | |
|---|---|
| విశాఖపట్నం | రూ. 425.00 |
| విజయనగరం | రూ. 429.00 |
| శ్రీకాకుళం | రూ. 429.00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్‌డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹117 | ₹204 | ₹ 214 |

# స్వయం ఉపాధి ప్రాప్తిరస్తు..!

- మహిళా సంఘాలకు అండగా బ్యాంకు లింకేజీ రుణాలు
- 2022/23 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి రూ.1312 కోట్ల రుణాలు
- స్త్రీనిధి పేరిట మరో రూ.186 కోట్లు
- 24,158 సంఘాలకు లబ్ధి



స్వయం సహాయక సంఘ సభ్యులు

### పది మందికి ఉపాధినిస్తూ..



ఈమె పేరు గుడ్ల శైలజ. నరసన్నపేట పంచాయతీ హడ్కో కాలనీ. ఐదో తరగతి వరకు చదివారు. స్వయం శక్తి సంఘంలో సభ్యురాలు కావడంతో బ్యాంకుల నుంచి రుణాలు పొందారు. వేరుశనగ చెక్కీలతో పాటు చేగోడీలు, ఇతర తినుబండారాలు తయారు చేస్తున్నారు. మరో 10 మందికి పని కల్పించారు. దీనంతటికీ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహమే కారణమని శైలజ చెబుతున్నారు.

నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక పథకాల్లో వారినే భాగస్వాములుగా చేయడంతో పాటు వారి ఖాతాల్లో నేరుగా సొమ్ము జమ చేస్తోంది. ప్రధానంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీ నిధి రుణాలు మంజూరు చేస్తోంది. చిన్నచిన్న అవసరాలకు, వ్యాపారాలకు ఈ సొమ్ము వినియోగించుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 24158 సంఘాలకు రూ.1312 కోట్ల మేర రుణాలను బ్యాంకుల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసింది. స్త్రీ నిధి పేరున మరో రూ.186 కోట్ల రుణాలను అందజేసింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇందిరా క్రాంతి పథం అధికారులు కృషితో బ్యాంకులు మంజూరు చేస్తున్న రుణాలతో మహిళలు వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు స్థాపించి అభివృద్ధి పథంలో పయనిస్తున్నారు.

**2023-24లో మరింతగా..**

జిల్లాలోని 30 మండలల్లో 1286 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 48957 సంఘాల్లో 5,58,955 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. 2022-23లో 35064 సంఘాలకు రూ.1282 కోట్లు రుణాలు ఇవ్వాలని డీఆర్‌డీఏ అధికారులు లక్ష్యంగా పెట్టుకోగా 24,158 సంఘాలకు రూ.1312 కోట్లు చెల్లించారు. లక్ష్యానికి మించి రుణాలుగా అందజేశారు. ఒక్కో సంఘానికి కనిష్ఠంగా రూ.50 వేలు నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకూ మంజూరు చేశారు. ముందున్న రుణాలు, పొదుపు మొత్తం ఆధారంగా అర్హత కలిగిన ప్రతి సంఘానికీ సభ్యుల డిమాండ్ బట్టి రుణాలు అందచేశారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతోనే బ్యాంకులు మహిళా సంఘాలకు రుణాలు కల్పిస్తున్నాయి. గతంలో బ్లాక్ లిస్టులో ఉన్న సంఘాలు దాదాపుగా వైఎస్సార్ ఆసరా పథకంతో వినియోగంలోనికి వచ్చాయి. వీరందరికీ కొత్తగా బ్యాంకులు రుణాలు కల్పిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1300 కోట్లు మేరకు లింకేజీ రుణాలు ఇవ్వాలని డీఆర్‌డీఏ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. సంఘాలు తీసుకుంటున్న రుణాల్లో రూ.3 లక్షల వరకూ సున్నా వడ్డీ అమలవుతుంది. అంతకంటే ఎక్కువ మొత్తాలను సభ్యులు తీసుకుంటే ఏడాదికి 12 శాతం వడ్డీని బ్యాంకులు వసూలు చేస్తున్నాయి. ఇతర రుణాలు, బయట మార్కెట్లో అధికంగా వడ్డీ ఉండటంతో స్వయం శక్తి సంఘాల మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలు అందుతున్నాయి. దీంతో మహిళలు పాన్‌షాపులు, కిరాణా షాపులు, టీ షాపులు, గొర్రెలు పెంపకం, జెరాక్స్ సెంటర్లు, అప్పడాలు, చుప్పుల తయారీ వంటి కుటీర పరిశ్రమలు పెట్టుకొని ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా వందలాది కుటుంబాలు జీవనోపాధిని మెరుగు పరుచుకుంటున్నాయి.

**విరివిగా రుణాలు...**



స్వయంశక్తి సంఘాల మహిళలకు 2022-23లో లక్ష్యానికి మించి రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించాం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కమ్యూనిటీ ఇన్వెస్ట్ ఫండ్ వినియోగించాలని సంఘాలకు అవగాహన కల్పిస్తున్నాం. స్త్రీనిధి రుణాలు లక్ష్యాలను పెంచి విరివిగా మహిళలకు రుణాలు ఇవ్వాలని భావిస్తున్నాం. పొదుపు మొత్తాలను వినియోగించుకోవాలని సభ్యులకు అవగాహన కలిగిస్తున్నాం.

– విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ

## జగనన్నను మళ్లీ సీఎంగా చేయాలి



వృద్ధురాలి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి అప్పలరాజు

పలాస: పేదల పెన్నిధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. పలాస మండలం లొద్దబద్ర పంచాయతీలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం, మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతామని చెప్పారు. అతి త్వరలోనే మహాదేవిపురం, పాత్రియ రోడ్డు పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టి, మాజీ అధ్యక్షుడు చింతాడ మాధవరావు, సచివాలయాల కన్వీనర్ దువ్వాడ రవి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొర్ల సంతోష్, తలగాన శ్రీరాములు, ఉంగ సాయికృష్ణ, జి.మోహనరావు, బొత్స షణ్ముఖరావు, మచ్చ ధనరాజు, మామిడి నర్సింహమూర్తి, ఎంపీడీఓ ఎన్.రమేష్‌నాయుడు, తహశీల్దారు మధుసూదనరావు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, పంచాయతీ కార్యదర్శి సద్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కంద్ర కులస్తులు

టెక్కలి: కంద్ర కులస్తులను బీసీ-ఏలో చేర్చేలా జీఓ విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని టెక్కలి నియోజకవర్గ కంద్ర కులస్తులు పేర్కొన్నారు. ఆదివారం టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వదేశీ మత్స్యకార సంఘం(కంద్ర కులస్తులు) ప్రతినిధులు హేరంబో, ఏ.మోహన్, హన్నూరావు, గోపినాథ్ బెహరా తదితరులు మాట్లాడుతూ.. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌ను టెక్కలి నియోజకవర్గ పర్యటనలో భాగంగా కలిసి తమను బీసీ-ఏ లోకి చేర్చాలని విన్నవించామని పేర్కొన్నారు. మరుసటి రోజునే జీఓ విడుదల చేశారని తెలిపారు. తమ సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో స్వదేశీ మత్స్యకార సంఘం ప్రతినిధులు త్రినాథ్ బెహరా, రామచంద్ర బెహరా, ఉమా బెహరా, మురా బెహరా తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



సామాజిక భవనానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: నాలుగేళ్లవైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధికే పెద్దపీట వేశారని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆదివారం లొద్దపుట్టి పంచాయతీ అయ్యవారిపేటలో హెచ్‌డబ్ల్యూ నిధులు రూ.5లక్షలతో సామాజిక భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గుర్తించిన సమస్యలు, ప్రజోపకరమైన పనులకు అవసరమైన నిధులు సమకూర్చి వాటిని పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్‌లు ఆశి సులోచనా రెడ్డి, నీలాపు సారథి, ఎంపీటీసీలు పిట్ట హేమలత, ఆశి మంథాకిని, మండల అధ్యక్షుడు పిట్ట ఆనంద్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, కార్యదర్శి రాంపత్ని చిట్టిబాబు, తిప్పన నాగరాజు, తిప్పన రామారావు, పిట్ట మామయ్య, కాళ్ల నారాయన, బుడ్డ కళ్యాణ్, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తం, దుక్క ఆనంద్, ఆశి దాలయ్యరెడ్డి, లలితా నాయక్, సాడి గురుమూర్తి, ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

## ఐక్యతతోనే తూర్పుకాపుల అభివృద్ధి



ఐక్య నినాదం చేస్తున్న తూర్పుకాపులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో అధికంగా తూర్పుకాపులున్నప్పటికి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటులోనే ఉన్నామని, అందరూ ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రమోహన్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయస్థాయి తూర్పుకాపు సంగ్రామ మహాసభ ఆదివారం ఓ ప్రవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో తూర్పుకాపులను అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం తూర్పుకాపుల్లో ఉన్నత పదవులు పొందినవారిని సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు, పంచాయతీరాజ్ ఛాంబర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనేపు రామకృష్ణ, శ్రీకాకుళం లైన్స్ క్లబ్ అధ్యక్షుడు, ప్రభుత్వ న్యాయవాది వాన కృష్ణచంద్, శ్రీకాకుళం జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, అరసవల్లి సూర్యనారాయణ దేవస్థానం బోర్డు సభ్యుడు లుకలాపు గోవిందరావు, సంఘ కో-కన్వీనర్ కద్దాల శ్యామసుందరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పతివాడ గిరీశ్వరరావు, తాటిరాజు రాజారావు, కురిటి మాధవ నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బబ్బాది పకీర్‌నాయుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరిమజ్జి మల్లేశ్వరరావు, మహంతి రమణారావు, కలిశెట్టి అప్పలనాయుడు, సురవరపు నాగేశ్వరరావు, వడిశ హరిప్రసాద్, హారికా ప్రసాద్, నందివాడ గోవిందరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కోయిలాపు శ్రీనివాసరావు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఆకుల అప్పలసూరినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సలాన చిరంజీవి, మత్స బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉషూ పోటీల్లో సిక్కోలు హవా



పతకాలు సాధించిన క్రీడాకారులతో నిర్వహణ కమిటీ ప్రతినిధులు, మేనేజర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తాచాటారు. ఇటీవల గుంటూరు జిల్లా కార్తికేయ డిఫెన్స్ అకాడమీ వేదికగా జరిగిన 9వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల ఉషూ ఛాంపియన్‌షిప్-2023 పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ముద్దాడ శిరీష (65 కేజీల విభాగం), భైరి ధనుంజయ్ (56 కేజీల విభాగం) బంగారు పతకాలు సాధించారు. పూణే వేదికగా మే 9 నుంచి 13వ తేదీ వరకు జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. సానివాడ గ్రామానికి చెందిన శిరీష డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతుంది. పొన్నాడ గ్రామానికి చెందిన ధనుంజయ్ బీపీఈడీ చదువుతున్నాడు. వీరికి కోచ్ మేనేజర్లగా రెడ్డి శివకుమార్, తారకరామ వ్యవహరించారు. క్రీడాకారులు రాణింపు పట్ల జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొమర భాస్కర్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, డీఎస్‌ఏ సీఈఓ బీవీ ప్రసాదరావు, పీఈటీ సంఘ నాయకుడు ఎం.వి. రమణ హర్షం వ్యక్తంచేశారు.

## రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రముఖ అనువాదకులు సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆయన అనువదించిన 'ఈడబ్ల్యూఎస్ : రిజర్వేషన్లను అంతం చేసే కుట్ర' పుస్తక పరిచయ కార్యక్రమం శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయంలో ఆదివారం ఎన్జీఓ సంఘ నాయకులు హనుమంతు సాయిరాం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్ల బిల్లు కేవలం 48 గంటల్లో పార్లమెంటు ఉభయసభల్లో పాసై, చట్టంగా రావడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. సిక్కోలు బుక్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దుప్పల రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచ పుస్తక దినోత్సవం నాడు పుస్తక పరిచయ సభ జరగడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విశ్రాంత ఐఏఎస్ అధికారి రుంకు అప్పారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాసాహితీ సంపాదకుడు పి.ఎస్.నాగరాజు, బీసీ అడ్వకేట్ సంస్థ అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు, బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి. తాతారావు, బి. కృష్ణారావు, బి.రామ్మోహనరావు, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.రాంగోపాల్ పాల్గొన్నారు.

## ఎకువూరులో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

సోంపేట: మండలంలోని ఎకువూరు గ్రామంలో పెద్దమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాల సందర్భంగా మే 3, 4 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.10,116, రూ.7,116, రూ.5116, రూ.3116, ట్రోఫీలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెలాఖరులోగా 8247728993, 7207544787 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## అ'పూర్వ' సమ్మేళనం



జి.సిగడాం మండలం దాలెంరాజువలస(డి.ఆర్.వలస) ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల కలయిగా ఆనందోత్సాహాల మధ్య జరిగింది. 1988-89 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఒకేచోట చేరి సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలు ఒకరితో ఒకరు పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు కాయల రమణ (జెడ్పీటీసీ సభ్యుడు), వంజరాపు సత్యం, లాభాన వీరాస్వామి, రమణరావు, మల్లేశ్వరరావు, శోభాదేవి, డి.లక్ష్మునాయుడు, చందక చిరంజీవి, వావిలపల్లి రమణరావును సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుమరాపు శ్రీనివాసరావు, పద్మావతి, గాంధీ, బూరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొగారు. - జి.సిగడాం

## • అలంకరణలు అదరహో..!



శివలింగం



ఫ్లవర్ ఫౌంటేన్



కృష్ణార్జునుల రథం

ఇచ్ఛాపురం ఇలవేల్పు స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీప అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఏనుగు అంబారీ, కృష్ణార్జునుల రథప్రయాణం, శివలింగం, ఫ్లవర్ ఫౌంటేన్, ఇండియన్ నేవీలు తదితర నమూనాలు అబ్బురపరుస్తున్నాయి.

– ఇచ్ఛాపురం



ఓడ



ఏనుగు అంబారీ